# గిరికి తరువు భారమా

-సుగుణ

**"జానూ!"**

"ఏవిటి తల్లీ! ఇంత రాత్రప్పుడు ఫోను చేస్తున్నావు? అదీ ఆస్ట్రేలియా నుంచి?"

"ఇక్కడ ఇప్పుడు పగలు. మలయ్, సరితా స్నేహితు లింటికి వెళ్లారు. నేను సిట్టర్‌తో వున్నాను. మలయ్ నీతో ఎంతసేపైనా మాట్లాడొచ్చన్నాడు."

"అలాగా! సరే, ఎలా వున్నావు? ఆస్ట్రేలియా విశేషా లేమిటి? ఏవేం చూశావు?"

"కిందటిసారే అన్నీ చూసేశాను జానూ. నీ కోసం కోలా బేర్స్ కూడా తీసుకొచ్చానుగా. ఈసారి గోల్డ్ కోస్ట్‌లో ఒక ఆర్టిస్ట్ నా బొమ్మ స్కెచ్ గీశాడు. అది తెస్తా. నీ రూమ్‌లో పెట్టుకో. నిన్ను చాలా మిస్ అవుతున్నాను జానూ. ఎయిర్‌పోర్ట్‌లో 'హార్ట్' అని ఏదో అన్నావు, మళ్లీ చెప్పు."

"Distance makes the heart grow fonder."

"ఆ! అదే! నేనింత దూరంగా వున్నాను కదా. అందుకే ఎక్కువ మిస్ అవుతున్నాను. పొట్టతో, చేతుల్తో, వీపుతో, గుండెకాయతో..."

"గుండెకాయేమిటే..?"

"అదే కోతి కథలో మొసలి తెమ్మంటుందే, అదీ!"

"కోతికైతే గుండెకాయ. మనకైతే 'హృదయం' అనాలి."

"సరే, నిన్నొకటి అడగాలి. మీ అమ్మ సంగతి, గుల్‌మొహర్ ట్రీ, అదంతా, ఆ మేటర్ చెప్పు."

"మేటర్ గురించి మేటర్ చెప్పమంటావు."

"అంటే?"

"లాటిన్‌లో మేటర్ అంటే అమ్మ, ఇంగ్లీషులో మేటర్ అంటే విషయం."

"అయితే ఇప్పుడు నాకు లాటిన్ కూడా వచ్చు. ఇది అయిదు భాష."

"అయిదో అనాలి. నీకొచ్చినంత లాటిన్ నాకు రాదు గానీ, తెలుగులో చెప్తా విను. మా అమ్మ తన పేరుకి తగినట్టుగానే కల్పవృక్షం. మా ఇంట్లో అందరినీ, చిన్నా పెద్దా అని లేకుండా, సమానమైన ప్రేమతో చూసేది. చెట్టు తన కాయలూ, పళ్లూ, పిట్టలు తింటున్నాయా, మనుషులు తింటున్నారా అని తేడా చూపకుండా కాస్తుంది కదా, అలాగన్నమాట. ఆవిడ అండలో పెరిగిన కుటుంబ సభ్యులంతా ఏభయ్ మందిమి వుంటాం.

మేం కాక, ఇంకా వచ్చే పోయే బంధుజనంతో ఇల్లెప్పుడూ కళకళలాడుతూ వుండేది. ఇందరినీ ఎంతో ప్రేమగా చూసుకునే మా అమ్మంటే మా చిన్నాన్నకి మట్టుకు ఎందుకో గిట్టేది కాదు. ఏవో మాటలని నొప్పిస్తూ వుండే వాడు. మా నాన్న ఎక్కువ సంపాదించే వారని అసూయ. చిన్నాన్నకి వ్యాపారంలో ఎప్పుడూ నష్టాలే. అయినా మా నాన్న ఆ కుటుంబాన్నీ ఏ లోటూ లేకుండా చూసేవారు. పిన్నికి కూడా అమ్మతో సమానంగా నగలు చేయించేవారు."

"చంద్రహారం, వడ్డాణం, అన్నీ?"

"వడ్డాణం కాదు. పిన్ని చాలా వలంగా వుండేది. వడ్డాణంకి చాలా డబ్బవుతుంది. నాన్న దగ్గర అంత డబ్బు లేదు. వడ్డాణం అమ్మకి వాళ్లమ్మ ఇచ్చింది. అమ్మ దాన్ని ఊరికే ఇనప్పెట్టిలో దాచి వుంచేది."

"'తలుపు మీద' లొక్కి బొమ్ముందని చెప్పావు, అదా?"

"నువ్వెప్పుడు ఏ భాష మాట్లాడతావో తెలియదే. ఇదీ 'ఒక్క పదం' భాషేనా, లాటిన్‌లాగా?"

"ఇంకా చాలా వచ్చు. ఠాకూర్‌దా నన్ను 'లాక్కీషోనా' అంటాడు. అంటే..."

"'లక్ష్మి బంగారూ' అని. నాకూ బెంగాలీ వచ్చులే. చక్కగా మీ తాతని బెంగాలీలో వరసతో పిలుస్తావు. మీ అమ్మా, నాన్నని పేర్లతో ఎందుకు పిలుస్తావే?"

"నువ్వే కదా పేర్లన్నీ చెప్పావు. అందుకే అలాగ పిలుస్తాను. నిన్నూ పేరు పెట్టే కదా పిలుస్తాను."




"'జాహ్నవి' నీకు నోరు తిరిగితే కదా! నాకీ 'జానూ'యే బావుందిలే. హిందీలో 'ప్రాణం' అని అర్థం. సరే, విను మరి."

"నాకు పెళ్లి చేశాక మా నాన్న చనిపోయారు."

"మలయ్ పుట్టాకే కదా?"

"ఆ.. మా నాన్న చనిపోయే నాటికి వాడికి ఏణ్ణర్థం."

"అంటే ఎయిటీన్ నెలలు. అవునా?"

"పద్దెనిమిది. మీ ఠాకూర్‌దా అప్పుడు అమ్మని తీసుకొచ్చి మా దగ్గరే వుంచేసుకున్నాడు. అమ్మ ఎంత సంతోషపడిందో! మనవడంటే ఆవిడకి చాలా యిష్టం.

"నీకు నేను వున్న కన్నానా?"

"నీ తెలుగు కాస్త సాన పట్టాలే. ఇలా అడ్డు తగులుతూ పోతూంటే బిల్లు చాలా అయిపోతుంది."

"మా మలయ్ దగ్గర చాలా డబ్బుంది. ఫోను బిల్లి స్తాడు. నువ్వు మీ పిన్నంత వలం అయిపోయినా వడ్డాణం చేయిస్తాడు కూడా."

"అమ్మ తల్లీ! ఇట్టే పదాలు పట్టేస్తావు. 'వలం' వైజాగ్ భాష. తప్పి జారి అనేశాను. 'లావు' అను. సరిపోతుంది. నాకే వడ్డాణమూ వద్దు కానీ, విను."

"అమ్మ మా దగ్గర పదేళ్లుంది. ఠాకూర్‌దా ఇల్లు కొన్నప్పుడు ఆవరణలో గుల్‌మొహర్ చెట్టు చూసి భలే సంబరపడింది. 'దీన్ని ఫ్లేమ్ ఆఫ్ ది ఫారెస్ట్' అని అంటార్రా!" అంది మీ నాన్నతో. వాడు వెంటనే అమ్మకి చాలా ఇంగ్లీషు వచ్చుని స్కూలంతా టాం, టాం కొట్టొచ్చాడు."

"నాకు లాటిన్ వచ్చినంత? హి హి హీ!"

"జోకులు బాగానే వేస్తావు. ఆదివారం వచ్చిందంటే చాలు, మీ నాన్న ఆ చెట్టు చుట్టూ సైకిలు తొక్కుతూ సమయం గడిపేవాడు. ఆకు పచ్చ హంబర్ సైకిలు, బ్రూక్స్ సీటూ, డైనమో, తళతళలాడే నికెల్ స్పోక్స్‌తో ముచ్చటగా వుండేది. వాడికా సైకిలంటే ప్రాణం. గరాజ్‌లో ఇప్పటికీ ఆయిలింగదీ చేసి వుంచుతాడు చూడు. అదీ!"

"జానూ!"

"మళ్లీ ఏమిటే?"

"ఇండియా రాగానే నేను గరాజ్ లోంచి సైకిలు తీసి తొక్కుతాను."

"పెద్ద సైకిలు. నీకందదు. తొక్కలేవు."

"నువ్వు పక్కన పట్టుకుని పరిగెడితే తొక్కుతాను."

"ఈ వయసులో నాకీ పరుగులెందుకే బాబూ! చెట్టు కథ వింటావా, వినవా?"

"వింటున్నాను కదా!"

"అప్పుడేమయిందంటే, మీ తాతగారిని జపాను నుంచి పెద్ద వ్యాపారస్థులు అక్కడికొచ్చి బిజినెస్ నడపమని అడిగారు. అసలే నష్టాల్లో వున్నామేమో, వెంటనే సరే అని జపాను వెళ్లడానికి సన్నద్ధం అయిపోయాడు మీ తాత. మీ నాన్న అమ్మని అల్లరి పెట్టేవాడు, ఆవిడ కిమోనో వేసుకుంటే కానీ జపాను వాళ్లు రానివ్వరని. అమ్మ నవ్వేది. అమ్మకి మీ బెంగాలీ తాతంటే ఎంత ప్రేమంటే, నేనెక్కడికయినా వెళ్లినపుడు, చేపలొస్తే, బేరం చేసి,

కోయించి, వంటింట్లో పెట్టించేది. మేం బ్రాహ్మలం కదా! ఇవేవీ తెలియవు. అయినా, అల్లుడి ఆదరణకి పూర్తిగా లొంగిపోయి, ఇదీ తన బాధ్యతల్లో ఒకటి అనుకునేది. చివరికి మీ తాత అలా ఎందుకు చేసాడో.."

"జానూ! ఏడుస్తున్నావా?"

"అమ్మని తల్చుకుంటే కన్నీళ్లు రాక మానవు తల్లీ!"

"అప్పుడు ఠాకూర్దా కల్పకంని జపాను తీసికెళ్లలేదు. అవునా?"

"ఓసి నీ, అమ్మ పేరెంత బాగా జ్ఞాపకం పెట్టుకున్నావే?"

"హా! ఏడుపు మర్చిపోయావు కదా! చెప్పు."

"మీ తాత అమ్మని వైజాగ్ ఇంట్లో వెళ్లి వుండమన్నాడు. అంతా అన్నారు, 'అల్లుడు కాబట్టే అలా అనగలిగాడు, కొడుకయితే ఇలా చేస్తాడా' అని, ఒప్పుకునేది కాదు అమ్మ. 'ఈ అల్లుడు అందరి లాంటి వాడు కాదు. సందర్భపడలేదు కాబోలు. అయినా ఆ జపాను గౌన్లు నేను వేసుకోలేను బాబూ', అనేసి సమర్థించి, చాటుగా వెళ్లి కళ్లు తుడుచుకునేది. వైజాగ్ వెళ్లడానికి మాత్రం సుతరామూ ఇష్టపడలేదు. ఎందుకంటే, నాన్న చనిపోయాక, అమ్మ తన వస్తువులు తీసుకోవడానికి వెళ్లినపుడు, చిన్నాన్న నానా దుర్భాషలాడి అమ్మని గుమ్మంలోంచే వెళ్లగొట్టేశాడు. అప్పటికే చిన్నాన్న ఇల్లంతా ఆక్రమించుకునీ, అద్దెలకిచ్చేసీ, నానా కంగాళీ చేసేసాడు. అమ్మ అత్తయ్యా వాళ్లింట్లో వుండి, అత్తయ్యకి తాళం ఇచ్చి, ఇనప్పెట్టె తెరిచి నగలు తెచ్చిపెట్టమంది. అత్తయ్య వెళ్లి చూసే సరికి ఇనప్పెట్లో చిన్నమెత్తు బంగారం కూడా లేదు, వడ్డాణంతో సహా. చిన్నాన్న ఎప్పుడు, ఎలా కాజేసాడో!"

"అమ్మ తిరుగు రైల్లో హైద్రాబాదు వచ్చేసింది. వైజాగ్‌లో ఇక ఎప్పుడూ అడుగు పెట్టనంది. ఆవిడ దుఃఖం చూడలేకపోయానే, నవ్య నూతన్! అటువంటి సంక్షోభం పగవాళ్లు కూడా అనుభవించకూడదమ్మా."

"జానూ, నాకు రెండు పేర్లు ఎందుకు పెట్టావు?"

"నవ్య మీ అమ్మ పెట్టిన పేరు. నూతన్ నటి అంటే నాకు చాలా ఇష్టం. రెండూ కలిపి నిన్నలా పిలుస్తాను. రెండింటిదీ ఒకటే అర్థం. పైగా నువ్వు నిత్యం కొత్తరకంగా ఆలోచిస్తావు. నీకు సరిపోయిన పేర్లేలే."

"ధొన్నాబాద్! సరే, అప్పుడేమయింది?"

"అమ్మ వైజాగ్ వెళ్లడానికి నిరాకరించింది. వకుళాంబ పిన్ని, అంటే అమ్మ చెల్లెలు దగ్గరకి కాకినాడ వెళ్లిపోయింది. పిన్ని కూతురు స్రవంతి అక్కడ డాన్స్ స్కూలు నడిపేది. అమ్మంటే పిచ్చి ప్రేమ. వైజాగ్‌లో స్రవంతి మా ఇంట్లోనే వుండి నృత్యం నేర్చుకుంది. అమ్మని 'ఇంకోమ్మా' అంటే ఇంకో అమ్మా అని పిలిచేది."

"అమ్మ అక్కడ సద్దుకుపోగలిగింది కానీ, మా మీద చాలా బెంగ పెట్టేసుకుంది. మీ నాన్నకి తెలుగులో వుత్తరాలు రాసేది. నేను చదివి వాడికి బోధపరిచేదాన్ని. స్కూలు నుంచి రాగానే వుత్తరం చదివించుకుని, అది పట్టుకుని, తిన్నగా గుల్‌మొహర్ చెట్టు గట్టు మీద కూచుని, ఆ అక్షరాలని అలా చూస్తూ గంటల తరబడి వుండిపోయేవాడు."

"ఈలోగా జపనీస్ కంపెనీ వాళ్లకీ, మీ తాతకీ ఏవో తేడాలొచ్చి, ఆఫర్ క్యాన్సిల్ చేసేసారు. అప్పులు తీర్చడానికి మీ తాత ఇల్లు డెవలపర్స్‌కి అమ్మేశాడు. వాళ్లు గుల్‌మొహర్‌ని కొట్టేయాలన్నారు. అది వినగానే మీ నాన్న వరసగా నెల రోజులు చెట్టు చుట్టూ సైకిలు తొక్కాడు."

"జానూ!"

"ఏంటమ్మా?"

"నాకేడుపొస్తోంది"

"అయితే రేపు మాట్లాడుకుందాంలే. ఇవన్నీ నిన్ను కలత పెడుతున్నాయేమో."

"కాదు. కళ్లు తుడిచేసుకున్నాను. చెప్పు."

"ఒకరోజు పొద్దున్నే, మీ నాన్న కాంపౌండులోంచి పెద్ద కేక పెట్టాడు. నేను ఏమిటా అని గాభరాగా వచ్చి చూసేసరికి, గుల్‌మొహర్ చెట్టు నేల కూలిపోయి వుంది. వేర్లు కూడా పైకొచ్చేసాయి. ఆ చెట్టుకి ఎవరూ తనని కొట్టేయడం ఇష్టం లేకపోయిందేమో, తనంతట తానే ఒరిగిపోయింది. చిత్రం ఏమిటంటే, ఆ క్రితం రాత్రి తుఫాను కాదు కదా, చిన్న వాన చినుకు కూడా పడలేదు, చెట్లు పడిపోవడానికి. అదో దైవఘటన. అంతే!"

"అదేరోజు స్రవంతి దగ్గర నుండి టెలిగ్రాం వచ్చింది, 'ఇంకోమ్మా పాస్డ్ ఎవే' అని. అమ్మకి ఇక మా అండ వుండదని అర్థమయి, తనంతట ఒరిగిపోయింది. ఒక జబ్బులేదు, జ్వరమూ లేదు. ఎవరికీ ఏ కష్టమూ కలిగించకుండా, అలా దైవ సాన్నిధ్యంలోకి వెళ్ళిపోయింది."

"నవ్య నూతన్! ఒకోసారి, పెద్దవాళ్లమయ్యాక అలాగే ఒరిగిపోవాలే. ఎవరికీ బరువు కాకూడదు."

"నువ్వు 'పెద్దవాళ్లం' కాదు. మలయ్‌కి మేటర్‌వి. నాకు జానూవి. నువ్వేమీ ఒరిగిపోవు."

"ఇప్పుడేం నాకు ఒరిగిపోయే టైము కాదులే. అసలు విషయమేంటి? ఎందుకీ వివరాలడుగుతున్నావు?"

"జానూ! మలయ్ బంజారాహిల్స్‌లో మనముండే బంగళాని మార్చి అయిదు స్టోరీలు కడుతున్నాడు. అయిదో స్టోరీలో మేముంటాము. నాలుగు స్టోరీస్‌లో ఇక్రిసాట్ వాళ్లుంటారు."

"ఓ! అదా సంగతి! అయితే విశాఖపట్నంలో మాలతీ ఆంటీ ఇంటి దగ్గర ఋషికొండలో ఇల్లు తీసుకుని వుంటాలే. మేమిద్దరం స్కూలు కూడా నడపాలనుకుంటున్నాం కూడా. అన్నిటికీ అనువుగా వుంటుంది. మాలతి నా ప్రాణ స్నేహితురాలు"

"వద్దు. నువ్వు ఇక్కడే వుండాలి."

"అయిదో ఫ్లోర్‌లో 'మేముంటాము' అన్నావుగా. మేములో నేను లేను. అయినా ఎలా వుంటానమ్మా? ఇబ్బందిగా వుంటుంది."

"ఎవరికి?"

"అందరికీనూ?"

"అందరికీనూలో నేను లేను. నేను వేరే"

"నీతో నేను వాదన పెట్టుకోలేనే నూతన్. నీవింకా చిన్న పిల్లవి. పెద్ద వాళ్ల మనసులు అర్థం చేసుకోలేవు. మీ నాన్నకి కోపం తెప్పించకు. ఇంతకీ ఇండియా ఎప్పుడొస్తున్నారు?"

"ఆగస్ట్ పద్దెనిమిది. నువ్వక్కడే ఇంకో రెండు నెల్లుండు, మాలతీ ఆంటీతో, స్కూలు పెట్టద్దు, నేను వచ్చి మేటర్ సెటిల్ చేసి, నీకు చెప్తాను."

"సరేలే. తెల్లారి పోయింది. ఫోన్ పెట్టేయి, ఇంక."

"సరే. ఇక్కడ రాత్రి ఇప్పుడు. మలయ్, సరితా వచ్చేసారు. జానూ! మాలతి ఆంటీ కాదు. నేను నీ ప్రాణ స్నేహితురాలు, గుడ్‌నైట్. శుభరాత్రి. షబ్బఖైర్!"

"ఎక్కడ దొరికావే నాకూ!"

❖ ❖ ❖

"జానూ! ఇది నీ 'కల్పతరువు'. నచ్చిందా?"

"నవ్య నూతన్! నీకీ చెట్టు కొమ్మలు చుట్టూ అమరేటట్లు, చక్కని తీరువుతో ఇల్లు కట్టే ఆలోచన ఎప్పుడు వచ్చిందే? ఇంత తక్కువ సమయంలో ఎలా జరిగింది దంతా? అసలు మన జాగాలో మామిడి చెట్టెలా వచ్చిందీ? ఇది వరలో లేదే!"

"ఆస్ట్రేలియాలో నా సిస్టర్ మెటిల్డా ఆర్కిటెక్చర్ కోర్సు చేసింది. నా దగ్గరకి వచ్చినప్పుడు మేమిద్దరం ఇళ్లు డిజైన్ చేసే వాళ్లం. నీతో మాట్లాడి, మేము ఈ ట్రీ హౌస్ డ్రాయింగ్ చేశాం. ఇండియా రాగానే, ఇక్రిసాట్ కాంట్రాక్టరుకి డ్రాయింగ్ చూపించాను. అతను వాళ్ల మేనేజర్సుతో చెప్పి, మామిడిచెట్టు అక్కడ ఫీల్డ్ నుంచి తీసుకొచ్చి ట్రాన్స్‌ప్లాంట్ చేయించాడు. వాళ్లకి చాలా టెక్నాలజీ తెలుసు. మలయ్ డబ్బిచ్చేసాడు. ఇల్లు తయారయిపోయింది. చిన్న ఇల్లు జానూ. నీకే సరిపోతుంది."

"నీ హృదయమంత వైశాల్యం గల ఇల్లు చిన్నదెలా అవుతుందమ్మా. ఖండ ఖండాలూ విస్తరించిన ఇల్లిది. నీ మమత కూడా అలాగే అన్ని దిశలా విస్తరిస్తుందమ్మా."

"జానూ! చూడు. ఈ కొమ్మ డాబా మీదకు ఎలా వచ్చిందో! సీజన్‌లో మనం డైరెక్ట్‌గా మామిడి కాయలు కోసుకుని తినేద్దాం. ఏం? రేపు దీపావళి. నీ పుట్టిన రోజు. ఈ యిల్లు నీకు మలయ్ ఇస్తున్న గిఫ్ట్. 'కల్పతరువు' పేరు నేనే సెలక్ట్ చేసాను, 'క్షీరసాగర మథనం'లోంచి. మీ అమ్మ పేరుకి ఎసోసియేషన్. మలయ్ గోల్డ్ నేమ్ ప్లేట్ రేపు తీసుకొస్తాడు. నువ్వు కొమ్మల చుట్టూ ప్రమిదలు పెడితే నేను వెలిగిస్తాను. కలర్ బల్బ్స్ కొమ్మల్లో మలయ్ డెకరేట్ చేస్తాడు. సరితా వాళ్లమ్మ ఇచ్చిన డైమండ్స్ పెట్టుకుని డెకరేట్ చేసుకుంటుంది. హి, హీ! సరితా చాలా బ్యూటిఫుల్‌గా వుంటుంది కదా! రేపు నీ ఇల్లంతా మీ వైజాగ్ ఇల్లులా ఎంతో... ఏమిటన్నావు ఫోనులో, ఆ, కళకళలాడుతూ వుంటుంది. మీ అమ్మని జ్ఞాపకం చేసుకో జానూ. బట్, ఏడవకు. నా కిష్టం లేదు."

"నాకింక జన్మలో ఏడుపనేది రాదే నవ్య నూతన్. ఇంగ్లీషులో చెప్పాలంటే, 'My cup runneth over.'

"జానూ, నువ్వొక పాట పాడతావు కదా, 'ధరణికి గిరి భారమా, గిరికి తరువు భారమా' – అని అట్లాగ, మా మలయ్ గిరికి, ఈ జానూ తరువు భారమా కాదు"

"భారం అనాలి"

"సరే. జానూ! నీ బర్త్‌డే గిఫ్ట్ నేను పెద్దయ్యాక ఇస్తా. నా డబ్బుతో కొనాలి. నువ్వు ఆలస్యం చెయ్యి."

"ఆలస్యం అనకూడదు. వెయిట్ చేయి అనడానికి వేచి వుండు అనాలి. లేకపోతే 'ఆగు' అనొచ్చు. ఇంతకీ ఏమిటది?"

"వడ్డాణం"

"నేనన్ని రోజులు ఆగలేను. ఇప్పుడే కావాలి. ఇలా రా. నీ చిట్టి చేతులు నా నడుం చుట్టూ వేసి గట్టిగా పట్టుకో. చూశావా! నువ్వే నా వడ్డాణం. ఈ వడ్డాణాన్ని ఎవరూ కాజేయలేరు."

"నేను ఇలా పట్టుకుంటే నువ్వూ ఎవరూ కాజేయలేరు నా జానూ! నువ్వు ఫరెవర్ నాది."

"ఫరెవర్."

■